దీర్ఘకవిత

అవధానుల మణిబాబు

నేనిలా... తానలా...



దీర్ఘకవిత

అవధానుల మణిబాబు

నేనిలా... లోనలా...



Nenilā... Tānalā...

(Long Poem)

Avadhanula Mani Babu, M.Sc., B.Ed.,

First Edition	:	**December, 2019**
Rights	:	**Writer**
Cover Page	:	**Arasavalli Giridhar,** Vijyawada
D.T.P.	:	**M.V.G. Srinivas,** Amalapuram
Printing	:	**Kalimi Sri,** Vijayawada
Price	:	Rs. 80/-

For Copies:

A. Mani Babu,

3-62, Near Bank of Maharastra,

Sarpavaram, Kakinada Rural, E.G.Dist.,

Andhra Pradesh - 533 005, Mobile : 99481 79437

నావో రెండు మాటలు...

ఎందుకు? ఏమిటి? ఎలా? – వీటి సమాధానాలన్నీ కవితలోనే చెప్పేశాను. ఐనా అక్కడ చెప్పలేనివేవో కొన్ని చెప్పాలని ఈ రెండు మాటలు.

నేను నెలల పిల్లాడిగా ఉండగా, నాన్నగారి ఉద్యోగరీత్యా ఉప్పాడ దగ్గరలో మూలపేటలో ఉండేవాళ్ళం. ఊహ తెలిసినప్పటినుండీ ప్రతి పర్వదినానికీ సముద్రస్నానం. సినిమాహాలు లేని ఆ పల్లెటూరిలో చుట్టాలెవరొచ్చినా కాలక్షేపం సముద్రమే. అలా... ఓ పదేళ్ళు.

2004 నుండి కాకినాడలో నివాసం. గడిచిన జీవితంలో ఎక్కువ కాలం సముద్ర తీరంలోనే. చదువుకున్న సాహిత్యం, పర్యావరణ శాస్త్రం సముద్రం పట్ల మరింత ఆకర్షణ, ఆవేదనలకు గురిచేశాయి.

డా. ఆవంత్స సోమసుందర్ "దీర్ఘ కవిత వ్రాయండి, అనేక కోణాలలో ఒకే అంశాన్ని దర్శించే అవకాశం ఉంటుంది" అని చాలాసార్లు చెప్పారు, వారుండగా వీలుకాలేదు.

ఈ మధ్య, సరదాగా ఓడలరేవు (అమలాపురం దగ్గర) వెళ్ళినపుడు నా ఉంగరం జారి సముద్రంలో పడిపోయింది. అక్కడున్నవారు సముద్రం ఏదీ ఉంచుకోదండి, తిరిగి ఇచ్చేస్తుంది. కానీ, ఎక్కడకి వస్తుందో తెలీదన్నారు. ఓ నాలుగైదు రోజులు అదే ఆలోచన – "నా ఉంగరం తీసుకున్నావ్, బదులుగా నాకేమిస్తావ్" అని. ఉన్నట్టుండి, నిజానికి సముద్రం మనకి ఇవ్వనిదేముంది అనిపించింది. అలా పుట్టిన వాక్యాలే ఈ దీర్ఘ కవిత. అక్కడివారన్నది నిజమే, సముద్రం తిరిగిచ్చేసింది.

అవధానుల మణిబాబు

"అనుకుంటున్నాను" నుండి "అయిపోయింది" వరకూ ఎన్నెన్నో విషయాలు చెప్పిన శ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తి గారు; Merchant Navy లో పనిచేసిన తన అనుభవాలను పంచుకున్న మిత్రుడు రామరాజు చౌదరి, సందేహాలను నివృత్తి చేసిన మరో మిత్రుడు ఉమాకాంత్ (మీలో ఎవరు కోటీశ్వరుడు ఫేం) – ఈ ముగ్గురూ ప్రధాన ప్రవాహాలు.

బావుందోయ్... అని ఉత్సాహపరిచిన – డా. రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు, శ్రీ గొట్టుముక్కల వేంకట సత్య నరసింహశాస్త్రి, శ్రీ మాకినీడి సూర్యభాస్కర్, శ్రీ అద్దేపల్లి ప్రభు, శ్రీ బొల్లోజు బాబా, డా. జోస్యుల కృష్ణబాబు, శ్రీ కొరుప్రోలు గౌరినాయుడు, శ్రీ కాకరపర్తి దుర్గాప్రసాద్, శ్రీ మహమ్మద్ ఇబ్రహీం, శ్రీ భాస్కర జోగేష్, శ్రీ తంత్రవహి శ్రీరామమూర్తి – వీరందరికీ ధన్యవాదాలు.

– అవధానుల మణిబాబు

ఇలా ...

అల్లంత దూరంనుంచే
అలా చూసి పోదామనుకున్నా!
ఉప్పుగాలి,
ఊరుకోదుగా ...!

చప్పని మనసులో
తీపి భావాలు ...

❖❖❖

కాలక్షేపం
కాళ్ళకు బంధనమైంది

భావ సముద్రం
చూసి కాదు –
ఏమైనా వ్రాసిపొమ్మంది.

❖❖❖

నాలో నేను ...

శ్రీకారం చుడుతుంటే
మణీ! ఇంకా నువ్వు వ్రాసేదేమిటోయ్?
నాలోంచి సందేహం
ఒకింత బిగ్గరగానే ...

❖❖❖

ఏం?

తన నిత్య యౌవన చైతన్యాన్ని
దశాబ్దాల పాటు పదిలంగా దాచిన
సంద్రంతో అనుబంధాన్ని
ప్రజాకవి అద్దేపల్లి
"మెరుపుపువ్వు"గా వికసింపజేశారుగా!

మానవ జీవిత పరిణామక్రమాన్ని
మహనీయుల చరితార్థాలను
తరంగ అంతరంగ ఆవిష్కరణగా మలచి
పర్యావరణ కావ్యంగా
సహస్ర భారతి గరికపాటి
"సాగర ఘోష"ను
విశ్వవ్యాపితం చేశారుగా!

నదికైనా నీకైనా
నడక కడలివరకేనని
కవి మిత్రుడు రామకృష్ణ
కవితగా పలికాడుగా!

విస్మృత కోణాలను విస్పష్టం చేస్తూ
బహుళ జాతి సంస్థల దౌష్ట్యాలను
కల్లోలిత కడలిని
తల్లడిల్లిన తీరవాసాన్ని
గనారా న"వల"లో బంధించారు కదా!
ఇక, చెప్పేదేముందా? అని.

❖❖❖

అరె!
అలా అంటే ఎలా?

కొత్త కెరటాలు రానిదే
కడలికి చైతన్యమేది?

మూలపేట తీరంలో
ముచ్చటైన బాల్యంలో
సంద్రంతో గడపని రోజుందా ...!

హోరుకి బెదిరిన గుండె
సర్వీచెట్ల నడుమ ఆపేస్తే
నెత్తిన నీళ్ళు చల్లుకుని
రాజీపడిపోయిన సంగతి.

ముసురు పట్టిన పర్వదినాల్లో
నాన్నపై మేకపిల్లెక్కి
ఒళ్ళు తడవకుండానే
ఉప్పుటేర్లు దాటిన సంగతి.

హైస్కూల్ చదువులపుడు
అంతర్వేది తీరంలో
పులిహోర, అరటిగెల
అరిగి మళ్ళీ ఆకలేశాకే
చీకటిపడ్డ సంగతి.

నరసింహుని కళ్యాణానికి
స్కౌట్ బృందంగా వెళ్ళి
భక్త జనసంద్రానికి
కావలి కాసిన సంగతి.

కాస్త ఎదిగాక ...

బృందగాన పోటీలప్పుడు
విశాఖ తీరపు వెన్నెల రాత్రిలో
మాటలు, పాటల మధ్యే
"మిత్రోదయ"మైన సంగతి.

ఇవన్నీ చెబుతాను,
ఏమనుకోకు, మరి.

❖❖❖

ఈ మాత్రం అనుభవాలు
అందరికీ ఉంటాయోయ్
విషయాలు కాదు,
విశేషాలుంటే చూడు ...

పూర్తిగా చెప్పనీ ...!

చిన్నప్పటి ఉప్పాడ గుడిని
క్రమంగా సంద్రం కలిపేసుకున్న సంగతి.
భావ నారాయణుని చక్రస్నానం వేళ
స్వామితో మునిగి తరించిన సంగతి

తొలిసారి జంటగా వెళ్లి
వారాశిని ప్రేయసిగా
పరిచయం చేసిన సంగతి

పసివాడినై పాపాయితో
కడలి ఒడిని ఆడిన సంగతి

సాహితీ స్రవంతి మిత్రులతో
కవన భోజనం పేరిట
'హోప్ ఐలాండ్' యాత్రలో
భయంగా
పరవశించిన సంగతి
......

ఏమీ తోచనపుడు
మనసు భారంగా తోచినపుడు
సంఘర్షణల్లో తోచీ తోచనపుడు
కారణం వెతికి మరీ
కడలిని చూసొచ్చిన సంగతి.

సాధారణ విషయాలేం కావుగా!

❖❖❖

మణీ!
సరదాగా అన్నాగానీ,
"తైరేవ విన్యాస విశేష భవ్యై:"
– తెలియనిది కాదులే.

ఐనా
ఎందుకంత ఆసక్తి?
ఏమిటా అనురక్తి?

ఎందుకుండకూడదు?
ఈమె నన్ను ఎపుడు నిద్ర పోనిచ్చిందని?

కథలెన్నో తిరిగింది ఈమె చుట్టూనే కదూ!
నులక మంచంపై పడుకోబెట్టి,
తుంగచాపపై కూర్చోబెట్టి
అమ్మ, అమ్మమ్మలు చెప్పిన
అవతారాలు, పురాణాలు ...
మామయ్య,బాబయ్యలు వినిపించిన
రాబిన్సన్ క్రూసో,
సింద్‌బాద్ సాహసాలు ...
తెప్పగా మఱ్ఱాకుమీద ... పాటలు వింటూ -
కలల అధిక శాతం సాగరయానమే కదూ!

పాల సముద్రం ఉందని విన్న తొలిసారి
తోడుపెడితే పెరుగవుతుందా?
లవణ సముద్రంతో కలిస్తే విరిగిపోతుందా?
......
సందేహాలతో
గడచిన రాత్రులు మరికొన్ని.

ఎన్ని సినిమాలో!
ఎన్నెన్ని వింతలో!
సాగర కన్యలు,
ప్రమాదాలు – ప్రేమ కథలు,
నిక్షేపాల అన్వేషణలు
సీసాల్లో పంపిన సందేశాలు
……
తెలిసీ తెలియని వయసులో
ఎంతెంత ఆశ్చర్యాలని!

అట్లాసులో
బల్లపరుపు కాగితమైనపుడు
గ్లోబులో
గుండ్రంగా తిరుగుతున్నపుడు
ఏడురంగులమధ్యా
నీలమొక్కటే నిక్కమై ఆకర్షించింది కదూ!

ఒక్క భూగోళం పుస్తకమేనా?
ప్రతి శాస్త్రం సాగరమే కదూ!
ఉప్పు సత్యాగ్రహాలు,
జల యుద్ధాలు,
నావికులు, నౌకా మార్గాలు,
ఖనిజాలు, అగణిత జీవజాలాలు …

బట్టీ పడుతూ
నిద్రచాలని రాత్రులెన్నో!

సాహిత్య జీవినయ్యాక
కథలలో, నవలల్లో, కవితల్లో
విషమయ జలాలు
కలుషిత తీరాలు
అంతరిస్తున్న జీవ వైవిధ్యం
తరలిపోతున్న ఇంధనం ...

ఈ వ్యథలు, గాథలు
చదివి, విని
నిద్ర దూరమయింది ఈమె వల్లనే కదూ!

❖❖❖

ఈ ముప్ఫై ఏడేళ్ళ ప్రేముడిని
మాటచేసి చెప్పొద్దంటే
స్నానం చెయ్యకుండా
సముద్రాన్ని చూసొచ్చేసినంత ఒట్టు.

కానీవోయ్ కాదన్నామా?
"నిరంకుశాః కవయః "
– విన్నానులే ...

నేను ... తాను ...

సంద్రమా!
తానడిగిన ప్రశ్నే
నిన్నడుగుతున్నా ...
ఎందుకు నీవంటే అపేక్ష?

వెర్రివాడా!
నువ్వు నా సంక్షిప్త రూపానివి
నేను నీ సమగ్ర స్వరూపాన్ని;

నేను అర్ణవం,
నువ్వు అక్వేరియం.
నీ భాషలో
త్వమేవాహం – అంతే.

❖❖❖

అంతమాటన్నావ్, అదిచాలు!
సంగతులేనాటివో
సుడులు తిరుగుతున్నాయ్.
మదిలో
సృజనను దాటి
స్ఫురణ, స్మరణ, పునశ్చరణ
పరుగులెడుతున్నాయ్.

❖❖❖

నిలబడి చూస్తుంటే
చేతులుచాచి పిలుస్తావ్;
నావ సాగిపోతుంటే
ఎగసి ఎగసి భయపెడతావ్.
నీ పైనుంచి ఎగురుతుంటే
హమ్మబాబోయ్ అనిపిస్తావ్.

ఇంత నటన అవసరమా?

మీరు మాత్రం ...
చేరువలో ఉన్నపుడు
దూరమవుతున్నపుడు
ఒకేలా ఉండరుగా?

మన వైఖరిలో మార్పుతప్ప
దోషం పరులది కాదు సుమా!

❖❖❖

క్షీర సాగర మథనంలో
ఏవేవో పుట్టాయట!
మీ మాటేమిటి?

మథించాలే గానీ
మేమేం తక్కువ చేశాం?

సంపద, చల్లదనం
ఆహారము, ఆవాసము
......
ఇక తీరని కోర్కెలు,
చేరని తీరాలు ఏమున్నాయ్.
కల్ప వృక్షాలు, కామ ధేనువులు
ఇంతకంటే ఏం చేశాయ్?

తెలుసా?
నీవూ సాగరానివే
మథించుకో
ఆత్మ జ్ఞానసుధ–
అపరిమితంగా దొరుకుతుంది
జాగ్రత్త సుమా!
కోరినది దొరికాక
ఏ మోహినీ విచలనాలకూ
నీలో రాక్షసాంశను చెలరేగనీయకు.

❖❖❖

ధనుష్కోటిలో
తేలుతున్న రాయిని చూసి
ప్రత్యేకత రాయిదా? నీటిదా? –
ఆలోచిస్తూ
కిటికీలోంచి చీకటిని చూస్తూ
నిదరోతున్న రైలులో
ఒక్కడినే మెలకువగా ఉన్నపుడు
"సాంద్రమైనదేదో వీడగలిగితే
తేలడం నీకైనా సాధ్యమే.
బెండులా తేలిక కావాలంటే
గుండె మెత్తబరచుకో" –
చెవి దగ్గరకొచ్చి చెప్పిపోయావ్ గుర్తుందా ...!

❖❖❖

కెరటమా!
ఏమంత హడావుడి?

ఆవిరవ్వాలి,
మేఘం కావాలి
చల్లబడాలి,
వాన కురవాలి
కాల్వనై సాగి
నదుల కలిసి
పరుగులిడతాను –
పుట్టింట లీనమయేందుకు.

బ్రతుకంటే
ఎన్ని చక్రాల భ్రమణమో!

ఉష్ణాన్నీ, శీతలత్వాన్ని
బదిలీ చేస్తేనేగా –
జగతికి సమతాస్థితి.

కాదనను గానీ
కాస్త నెమ్మదిగా ...

నేనూరుకున్నా
కెరటాలు కొన్ని తరుముకొస్తాయ్,
ప్రక్కనున్నవి పద పదమంటాయ్.
రోదసి మిత్రుల
భ్రమణ పరిభ్రమణాలు
ఆకర్షణలు,వికర్షణలు

తరిమే వారి కోసమో,
తోటి వారి కోసమో
నువ్వయినా, నేనయినా
సాగిపోవాలే గానీ,
ఆగిపోతే ఎలా?.

❖❖❖

ఓసారెపుడో
నీ మధ్యలో నిలుచుని అడిగాను
'అరె,
ఈ ప్రశాంతత ఎక్కడ నేర్చావ్'?

ఇదంతా ఉపరితల నటనేనోయ్
అంతర్గతంగా ఎంత అలజడో ...!
భౌతిక వైషమ్యాలు, మనో వైకల్యాలతో
నీకు జీవనం – వెంటాడే వధ్యశిల
జల చరాలు,
బడబానలాలు ...
– నా దేహం
చర్యాశీల నిత్య ప్రయోగశాల

మనకా? నిశ్చలత్వం, నిర్మలత్వం ...?

❖❖❖

మా దాహం తీర్చని ఆ రుచి ఎందుకు?
తనువంతా తీపినే నింపుకోవచ్చుగా!

సకల ప్రకృతీ నీకోసమే కాదోయ్
ఉప్పునీట బ్రతికే జీవులకోసం
నేనిలా లేకుంటే ఎలా?
ఐనా, నీ కోసం నన్ను
మంచి నీటిగా
అనువదించుకున్నానుగా!

❖❖❖

వేసుకున్న ముద్రలు,
వ్రాసుకున్న రాతలు
అలా చెరిపేస్తావే?

చెరిపిపోవటం కాదు
వాటిని నాలో దాచుకోవడం.
భాష తెలియక ఘోషనుకుంటారు గానీ
నా శబ్దాలన్నీ మీ రాతల కలవరింతలే.
మీ ఆటల తలపోతలే.

❖❖❖

ఇవన్నీ అన్నవి, మనం అనుకున్నవి.
పదుగురితో పంచుకోమంటావా మరి?

సరదాగా చెప్పిన సంగతులన్నీ
పదిలమయ్యేలా ప్రచురిస్తానంటే
కాదంటావా?

ఇదంతా
నీలో దోసెడు నీళ్ళు తీసి
మరలా నీలోనే విడిచిపెట్టడం

అడిగి తెలుసుకున్నవే కాదు
చూస్తూ నేర్చుకున్న సంగతులెన్నని?

నేనిలా ...

చెలియలికట్ట వరకే
తరుముతావనుకున్నా ...!
వందల మైళ్ళ దూరంలో ఉన్నా
నీ ఆలోచనలే ....
ఈ నిస్తంత్రీ హృదయానుసంధానం
ఎలా నేర్చావ్?

❖❖❖

నీలో
ప్రతిబింబం చూసుకుందామంటే
ఎన్నో నాటికల్ మైళ్ళు దాటాకే
స్పష్టాస్పష్టంగా సాధ్యమైంది.

నీడగానైనా కనిపించాలంటే
వేల కెరటాలను దాటాలి కదూ ...!

❖❖❖

తడిపిపోవడం కాదు,
ఇసుక, నీరు, గాలి –
మూడు స్థితుల పదార్థాలతో
ముంచెత్తుతావ్
తెలియక స్నానమంటాంగానీ
అది
అంతరాంతర జ్యోతిస్సీమల
అపూర్వ సందర్శనం

❖❖❖

నువ్వు ప్రపంచపు
అంచువన్నారంతా...
దగ్గరైనపుడు తెలిసింది
ప్రపంచమంటే నువ్వే.

❖❖❖

నన్ను తట్టి లేపాల్సిన సందర్భాలు రెండు
ఒకటి
గాఢనిద్రలో
రెండు
నీ ఎదుట ఉన్నపుడు.

❖❖❖

ఒడ్డున మౌనంగా గడిపిన ప్రతిసారీ
గొప్ప సంభాషణ ముగించిన అనుభూతి!

❖❖❖

ఒంటరిగా కూర్చొని
నిన్నే చూస్తుంటే
వాళ్ళకేదో సందేహం.
అది నిజమే,
నేనొచ్చినది –
నానుండి వీడి'పోడానికే' ...!

❖❖❖

ఎంత తీసినా తరగనట్లు,
ఎంత పోసినా పెరగనట్లు..
......అపారం నీ మరో పేరు కదూ..!

❖❖❖

భయపడేవాడు
ఒడ్డునే ఉండిపోతున్నాడు.
బ్రతుకు గడవనివాడు
నీలో పోరాడుతున్నాడు;
భయాన్ని జయించినవాడు
ఎదురీదుతున్నాడు
......
నువ్వో వ్యాపార కేంద్రం,
రణరంగం
కార్య క్షేత్రం,
విలాస స్థానం.
ఏం కావాలో పట్టుకెళ్ళడం వచ్చినవాడి సత్తా.
చెంబుడు నీళ్ళా,
ఇన్ని గులక రాళ్ళా?
ఖనిజాలా? ఇంధనాలా?
మరో దేశంపై పెత్తనమా?

ప్రయత్నించిన వాడినెవ్వడినీ
నిరాశపడనివ్వని చరిత్ర నీది.

నాడైనా, నేడైనా,
నీటిని నెగ్గినవాడే
నేలకు రాజు.

బావుందోయ్, మణీ!
ఇంతగా అర్థమయ్యానా?

అర్థం కాకపోవడానికి
నీకు నాకు
భేదం ఏముందని?

పోటు పాటులు, కెరటాలు, ప్రవాహాలు
కలిస్తేనే నువ్వైనా, నేనైనా.

శబ్దాలు, నిశ్శబ్దాలు,
ముత్యాలు, మాలిన్యాలు
ఇద్దరిలోనూ ...!

నేనో ప్రత్యేక విభాగమని భ్రమపడతా గానీ
నీలాగే
ఓ మహా సమూహంలో
అంతర్భాగాన్ని, కదూ ...!

రోజూ చూస్తున్నా
బిడ్డపట్ల వాత్సల్యం తీరనట్లు
రోజూ కలిసినా
అధికారంటే భయంపోనట్టు
రోజూ మాట్లాడినా
మిత్రునిపై మక్కువ తరగనట్టు
నీతోనూ అంతే ...
......నిజానికి,
అత్యంత సన్నిహితమైన
అపరిచిత అంశం నువ్వు.

❖❖❖

తానలా ...

సరే ఇక ముగిద్దాం.
మరిన్ని సంగతులుంటే చెప్పు
సలహాగానో ... సందేశం గానో ...

సంగతులే చెబుతాను
సందేశం నువ్వే అన్వేషించుకో.

నాలో ప్రమాదకర జీవులున్నా
అవి పరిధి దాటి చరించవు
నీలో అవాంఛనీయతలున్నా
అవధిదాటి ప్రకటించకు.

❖❖❖

రంగులలో వైవిధ్యమున్నా
జలస్థితిని విస్మరించను
అపుడపుడూ ఘనీభవించినా
మరలా నీరై పోతాను.

సహజాతాలు శాశ్వతం సుమా!

❖❖❖

మంచుగడ్డలు అడ్డమైతే
ఛేదించుకుపోవాలి.
అవరోధాలను జయిస్తేనే
ఓడ గమ్యం చేరేది.

❖❖❖

నాలో ప్రాణులు కొన్ని
గాలి బుట్టలు దాచుకుని
పడవల్లా తేలుతాయ్
మనుగడ సాగించాలంటే
అనువుగా
పునర్నిర్మించుకో.

నేలమీదైనా నీటిలోనైనా
మార్గం నిర్ణయమయ్యాక
'మ్యాప్'ని విస్మరించకు.

సమాజం నిర్ణయించిన
నిర్దిష్ట రేఖాంశాలు,
నిర్దుష్ట అక్షాంశాల మధ్య
నీ ఉనికిని
మరల మరల సరిచూసుకో.

గీతలు చదవలేక
నీటిపై హద్దులు దాటితే
పొరుగు దేశాలు క్షమించవు
'మితిమీరిన పయనానికి
ఫలితమెపుడూ విషాదమే'.

❖❖❖

ఇసుక తుపానులు నిలువరించినపుడు
పొగమంచు నియంత్రించినపుడు
తప్పనిసరి వెనకడుగు
– పలాయనం కాదు
పయనంలో భాగం.

❖❖❖

సంద్రమా
అనుసరిస్తాను, ఆచరిస్తాను,
ఇంకేదో చెప్పబోయి
ఆపినట్టున్నావ్ ...

చెప్పాలనే ఉంది
నీవేమనుకున్నా సరే ...

ఇంత నీటి మధ్య
చెప్పలేనంత కన్నీరుంది.

మొన్నటి వరకూ
మీ కవిత్వానికి ముఖచిత్రంగా
సైకత తీరాన్నో,
సాగర ఫేనాన్నో
ఉవ్వెత్తున ఎగసే అలల సమూహాన్నో
నా అనంత అంతర్భాగాన్నో
చిత్రించుకునేవారు
ఛాయా చిత్రాల ప్రదర్శనల్లో
నా సౌందర్యానికే
ప్రథమతాంబూలం.

కానీ, ఇపుడు
సామాజిక మాధ్యమాల్లో –
కడుపులో ప్లాస్టిక్ నింపుకున్న
షార్క్ ల మృతదేహాలు;
వలల నిండా జీవంలేని తాబేళ్లు
……
ఎటు చూసినా
భయానక భవిష్యత్తే
చిత్రాలై దర్శనమిస్తోంది.

ప్రపంచ పర్యావరణ సదస్సులన్నీ
నాపై అంతులేని జాలి కురిపిస్తున్నాయ్.

నాలో రత్నాలను, తేలియాడే పూలను చూసి
తారలతో నిండిన గగనంగా వర్ణించిన మీ కవులు
ఇపుడు ఏమని వ్రాస్తారు?
'భూలోకపు వైతరిణి' అనా?

జీవ వైవిధ్యం అంతా
కోట్ల మెట్రిక్ టన్నుల వ్యర్థాల మధ్య
మరణం దిశగా బ్రతుకునీడుస్తుంటే
విషతుల్యమైన నా విలాపం
వ్రాసే "కరుణశ్రీ" ఎవరు?

❖❖❖

‘ఆఫ్ షోర్ డ్రిల్లింగ్’ పేరిట
ఛిద్రమౌతున్న నా అంతర్భాగాన్ని;
ఆమ్లత్వం పెరిగిన జలతత్వానికి
డెడ్‌జోన్స్‌గా బిరుదు పొందిన
నా దేహభాగాలను;
ధ్వని కాలుష్యానికి
తల్లడిల్లుతున్న డాల్ఫిన్స్ వెతలను;

ఉపరితలంగా మారిన
మిలియన్ గ్యాలన్ల ఆయిల్ వ్యర్థాలను;
అలజడి రేపుతున్న
నేవిగేషన్ సోనార్ పర్యవసానాలను

పట్టించుకోలేనంతగా
ప్రగతి వైపు సాగిపోతున్నారు కదూ!

ప్రకృతి ప్రసాదించిన కర్పరాలని సైతం
CO_2 కబళిస్తుంటే
కిలోమీటర్ల లోతున దాగినా
సముద్ర జాతులకు భద్రత లేదా?

భూమిపై ఆధిపత్యం కోసం
నాలో క్షిపణి ప్రయోగాలు –
ఎవరిచ్చినదీ అధికారం?

ఒడ్డున కూర్చునేందుకు
శుభ్రమైన స్థలాన్ని వెతికే స్థితి
"కలుషితమైన నీరు స్నానం చేయకండని"
హెచ్చరికలు రాసే పరిస్థితి.
మీ అభివృద్ధికి -
నా గుండె నీరైపోతోంది సుమా!

అర్థ శతాబ్దం క్రితమే
"ఇన్విజిబుల్ త్రెట్" అని
చర్చలతో సరిపెట్టుకున్నా
ఇన్ని సునామీలు, భూకంపాలు
ఇటూఇటాయి, మినిమిటా సంఘటనలు
ముంపునకు గురైన మహానగరాలు
విని, చూసి,
ఉపేక్షిస్తున్న మిమ్మల్ని
ఏమని అర్థంచేసుకోమంటావ్?

నాలో జీవులు విషమయమైతే
మానవాళీ రోగగ్రస్తమేగా.
ఆహారపు గొలుసులో
ముప్పు ఎవరితో మొదలైనా
అంతరించేది అందరూ కదా?

వేల అడుగుల క్రింద చేరిన
వ్యర్థాలను తొలగించేది ఎవరు?
సరిదిద్దుకోలేని నీకు
తప్పు చేసే హక్కెవరిచ్చారు?

చివరిగా ఒకమాట ...
ఇపుడిక ఇన్ని పేర్లు
అవసరం లేదు మణీ!
భూమిపై జలరాశి మొత్తం
కేవలం "మృత సముద్రమే".

ఇదే కొనసాగితే
నా నుండి విడివడిన భూమి
మళ్ళీ నాలో కలవడం
మరెంతో దూరంలో లేదు.
అపుడు
వేదన వినిపించేందుకు
నాకు మనిషి దొరకడు.
తలబాదుకు విలపించేందుకు
ఒడ్డు మిగలదు.

చాలిక ...

సరే,
ఇంత సంతోషం పంచిన నీకు
గోడు వినిపించి గొడవ చేశానేమో?
మంచి మిత్రుని వద్ద
మాట దాచలేకగానీ
సముద్రమంత బాధ
నీవు తీర్చగలవని కాదు.

❖❖❖

విహారం కోసం వచ్చిన వాళ్ళం
వెనుతిరగక తప్పదుగా!

ఉంటాను మరి!

తేలికగా, తరగలుగా
తానలా...
బాధగా, భారంగా,
ఒకింత బాధ్యతగా
నేనిలా...

❖❖❖

మెరుపు పువ్వు	:	డా. అద్దేపల్లి రామమోహనరావు 1995లో ప్రచురించిన దీర్ఘ కవిత. ఇది 1971 నుండి 1995 వరకూ వారి కవితావేశరేఖకి ఒక స్థూలమైన ప్రతిబింబం.
సాగర ఘోష	:	మహా సహస్రావధాని డా. గరికపాటి నరసింహారావు 2001లో ప్రచురించిన "భౌతిక మానసిక పర్యావరణ పద్యకావ్యం".
నడక కడలి వరకే	:	శ్రీ వద్దిపర్తి రామకృష్ణ శ్రీవత్స 2014 లో ప్రచురించిన దీర్ఘకవిత.
కడలి కల్లోలం	:	శ్రీ గదుల నాగేశ్వరరావు (గ.నా.రా) 2016లో ప్రచురించిన నవల.
మూలపేట	:	తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడకు 30 కి.మీల దూరంలో ఉన్న సముద్రతీర గ్రామం. ఇక్కడ మాఘ మాసంలో జగన్నాథస్వామి తీర్థం అత్యంత వైభవంగా జరుగుతుంది.
అంతర్వేది	:	తూర్పు గోదావరి జిల్లాలో అమలాపురానికి 50 కి.మీల దూరంలో ఉన్న ప్రసిద్ధ నారసింహ క్షేత్రం. గోదావరి, బంగాళాఖాతాల సంగమ స్థలం.
భావ నారాయణుడు	:	తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ సమీపంలో "సర్పవరం"లో వెలసిన స్వామి శ్రీ భావనారాయణుడు.
ఉప్పాడ గుడి	:	ఉప్పాడలో సముద్రం క్రమేపీ ముందుకు రావడం వలన పూర్వం ఉన్న శివాలయం సముద్రంలో కలిసిపోయింది.

హోప్ ఐ లాండ్ : కాకినాడతీరానికి దగ్గరలో ఉన్న దీవి. సుమారు ఎనిమిది కి.మీ ల చదరపు విస్తీర్ణం గల ఈ భూభాగంలో దాదాపు 400 కుటుంబాలు జీవిస్తున్నాయి.

నీటిపై తేలే రాళ్ళు : రామేశ్వరం వద్ద ధనుష్కోటిలో ఒక విధమైన రాళ్ళు(?) నీటిపై తేలుతాయి.

ఆఫ్ షోర్ డ్రిల్లింగ్ : సముద్రతీరానికి దిగువన ఒక బావిని త్రవ్వి, రాతిలో పెట్రోలియం అన్వేషించి వెలికితీసే యాంత్రిక ప్రక్రియ.

నేవిగేషన్ సోనార్ : నీటి ఉపరితలంపై లేదా దిగువన ఉన్న వస్తువులను నావిగేట్ చేయడానికి, సమాచారాన్ని అందజేయడానికి ఉపయోగించే ధ్వని సంబంధిత సాంకేతిక ప్రక్రియ.

కర్పరాలు : కొన్ని వర్గాల సముద్ర జీవులకు ఉపరితలంపై ఉండే పెంకువంటి నిర్మాణం.

మినిమిటా : జపాన్‌లోని మినిమిటా నగరంలో 1956లో మొదటిసారి ఈ వ్యాధిని గుర్తించారు. పారిశ్రామిక వ్యర్థ జలాలలోని మిథైల్ మెర్క్యురిని సముద్రంలో విడిచిపెట్టడం వలన తీరంలోని చేపలుతిన్న ప్రజలు మినిమిటాకి గురయ్యారు.

ఇటై ఇటాయి : జపాన్‌లోని టోయామా తీరంలో కాడ్మియం వ్యర్థాల వలన 1912 ప్రాంతంలో ప్రబలిన వ్యాధి. దీని అర్థం It hurts, it hurts అని.

Nenilā ... Tānalā ...

Avadhanula Mani Babu

